క్లుప్తంగా

చెట్లకొమ్మల తొలగింపు ప్రారంభం



చెట్లకొమ్మలు తొలగించిన సిబ్బంది

సాక్షి స్పందన

పాలకుర్తి: బసంత్‌నగర్ విమానాశ్రయ ప్రతిపాదిత స్థలం మూలమలుపు నుంచి బసంత్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కమ్మేసిన చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియను మంగళవారం పంచాయతీ సిబ్బంది ప్రారంభించారు. 'సాక్షి'లో సోమవారం రహదారిని కమ్మేసిన చెట్లకొమ్మలు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి బసంత్‌నగర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, మండల పంచాయతీ అధికారి సుదర్శన్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ సిబ్బంది చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

మంథని: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్య అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులకు గురుకుల విద్యాసంస్థ వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తుందని మంథని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. గురుకుల పాఠశాలలో 2017 నుంచి ఇప్పటి వరకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులు అభ్యసించలేని స్థితిలో ఉండి నిరుద్యోగులుగా ఉన్న విద్యార్థులకు వివిధ రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనుననట్లు పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థ ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతీరోజు మూడుగంటల పాటు 30రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

షీటీంపై అవగాహన కల్పించాలి

సుల్తానాబాద్‌రూరల్: షీటీంపై పాఠశాలల్లో ఉపాధ్యాయులు బాలికలకు అవగాహన కల్పించాలని షీటీం సభ్యులు స్నేహలత కోరారు. మండలంలోని గర్రెపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శిక్షణ ఉపాధ్యాయులకు షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో షీటీంపై మంగళవారం అవగాహన కల్పించారు. స్నేహలత మాట్లాడుతూ ఎవరైన వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, భరోసా కోఆర్డినేటర్ అశ్రిత, రిసెప్షనిస్ట్ అనూష, హెచ్‌ఎం కవిత, టీచర్లు ఉన్నారు.

ఇన్‌పేషెంట్లకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న మనాలి ఠాకూర్

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం ఇన్‌పేషెంట్లకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి, మక్కాన్‌సింగ్ సేవాసమితి చైర్మన్ మనాలి ఠాకూర్ పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలను కలిసి వారి ఆరోగ్యంతోపాటు ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలతీరుపై అడిగి తెలుసుకున్నారు. అలాగే నవజాత పిల్లలకు అందిస్తున్న చికిత్స తీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్‌ఎంఓ డాక్టర్ రాజు, కాంగ్రెస్ నాయకుడు నెలకంటి రాము, ఆస్పత్రి సూపర్‌వైజర్ శివ, తాజ్, అన్వర్ ఉన్నారు.

హమాలీ కార్మికుడికి పరిహారం అందించాలి

పెద్దపల్లిరూరల్: మేడిపల్లి సొసైటీలో ధాన్యం బస్తాలు లారీలోకి ఎక్కిస్తుండగా జారి కింద పడి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జిల్లాలోని పాలకుర్తికి చెందిన నక్క లక్ష్మయ్య అనే కార్మికుడి వైద్యఖర్చుల కోసం పరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్ కోరారు. మంగళవారం జిల్లా కార్మికశాఖ అధికారి కార్యాయంలో వినతిపత్రం అందించారు. ప్రమాదంలో లక్ష్మయ్య వెన్నుపూస విరిగిందని, ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నాయకులు సదానందం, కుమార్, మల్లేశ్, స్వామి, మల్లేశ్, రాజయ్య, చంద్రమౌళి, భూమయ్య, విష్ణు, లక్ష్మణ్, రాజేశం, ఐలయ్య, రమేశ్, పర్వతాలు, లింగయ్య, సతీశ్, తిరుపతి, హరికృష్ణ ఉన్నారు.

నేడు గుండారంలో పెద్దమ్మ బోనాలు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో బుధవారం పెద్దమ్మ బోనాల మహోత్సవం నిర్వహించనున్నారు. పెదమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు.. దిగుబడి బాగు

- నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని సూచిస్తున్న వ్యవసాయ అధికారులు
- రోహిణి కార్తె ప్రవేశంతో వ్యవసాయ పనులు ప్రారంభం
- నార్లు పోసేందుకు రైతన్న సిద్ధం



పెద్దాపూర్‌లో నారు పోసేందుకు దున్నిన రైతు

జూలపల్లి: పంటల సాగుకు అదనులో విత్తనాలు వేసుకుంటే దిగుబడి ఎక్కువగా వస్తుంది. వాతావరణం అనుకూలంగా ఉన్న సమయంలో తెగుళ్లు దరి చేరకపోగా, పంటలు ఆరోగ్యంగా పెరిగి, పంట దిగుబడికి ఊతమిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు. మే 25 నుంచి రోహిణి కార్తె ప్రవేశించడంతో వానాకాలం ప్రారంభమై, పంటల సాగుకు అనుకూల సమయమని అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయం లాభసాటిగా ఉండేందుకు రైతులు ఆధునిక సాగు పద్ధతులు అవలంభించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షలు, భూసారం పెంచే పచ్చిరొట్టతో పాటు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, సమయానుకూలంగా నార్లు పోసుకోవాలని సూచిస్తున్నారు.

నార్లు పోసేందుకు సిద్ధం..

బావులు, బోర్ల కింద వరినార్లు పోసేందుకు దుక్కులు దున్నేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ అంచనాలకు తగ్గట్లు విత్తనాలు సిద్ధం చేసిన అధికారులు నిబంధనలు పాటించి, నాణ్యమైన విత్తనాలనే రైతులకు విక్రయించాలని ఆదేశించారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించి తనిఖీలు చేపడుతుండగా, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఆదేశించింది.

మండలంలో సాగు వివరాలు..

మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వరిసాగు చేసేందుకే రైతులు మొగ్గ చూపుతున్నారు. ఈ వానాకాలంలో సన్నాల సాగు ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. 13,150 ఎకరాల్లో వరిసాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనాలు ఉన్నాయి.

నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి



రైతులు అధిక దిగుబడి సాధించేందుకు నాణ్యమైన విత్తనాలు తీసుకోవాలి. ఇందుకు సన్నరకాలు బీపీటీ 5204, వరంగల్ 44(సిద్ధి), కేపీఎస్ 2874, ఆర్ఎన్ఆర్–11718, ఎంటీయూ–1061 రకాలను రోహిణి కార్తె మించకుండా నార్లు పోసుకోవాలి. దొడ్డు రకాలు వరంగల్–3962, 13400, 915, ఎంటీయూ 1001, జూన్ దాటకుండా నార్లు పోసుకోవాలి.

– ప్రత్యూష, ఏవో, జూలపల్లి,

తీగ ఊపితేనే బోరు నడుస్తది..



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని గోకుల్ నగర్ నుంచి ఖబ్రస్తాన్‌కు వెళ్లే దారిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరు మోటారుకు విద్యుత్ కనెక్షన్‌ను వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలించారు. బోరు మోటారు ఆన్ చేయాలంటే విద్యుత్ తీగలకు తగిలించిన వైరును ఊపితేనే బోరు స్టార్ట్ అవుతుందని సమీపంలోని మహిళలు పేర్కొన్నారు. బోరు మోటారుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్, స్టాటర్ బాక్స్‌కు కిందికి ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, గ్రామపంచాయతీ, విద్యుత్ శాఖ సిబ్బందికి తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

భారీ వర్షం.. తడిసిన ధాన్యం



ఎలిగేడు: ధూళికట్టలో వర్షానికి తడిసిన ధాన్యం ఆరబోస్తున్న రైతు



ఫెర్టిలైజర్‌సిటీ: గుంటూరుపల్లి కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు



జూలపల్లిలో కురుస్తున్న వర్షం



కాల్వశ్రీరాంపూర్‌లో కురుస్తున్న వర్షం

ఎలిగేడు/ఫెర్టిలైజర్‌సిటీ/మంథని/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఎలిగేడు మండలంలోని ధూళికట్ట సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. 20రోజులుగా పడిగాపులు కాస్తున్నామని, తేమ శాతం రావడంలేదని చెప్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పలు గ్రామాల్లో వర్షానికి ధాన్యం తడిసిందని రైతులు లబోదిబోమంటున్నారు. జూలపల్లి మండలవ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. కాల్వశ్రీరాంపూర్ మండలంలో జోరుగా వర్షం కురిసింది. లోతు దుక్కులు తీసిన రైతులకు నేలపైనున్న పోషకాలు వరదలో కొట్టుకుపోకుండా నేల లోపలకు నీరు వెళ్లి ఖరీఫ్ పంటకు అనుకూలంగా పోషకాలు అందుతాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. పాలకుర్తి మండలం గుంటూరుపల్లిలో కురిసిన వర్షానికి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిశాయి. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మంథనిలో కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు పారింది. గంటకుపైగా భారీ వర్షం కురవడంతో మురుగు కాల్వలు నిండి రోడ్డుపై పారాయి. ఆర్టీసీ బస్టాండ్, పద్మశాలి వీధి, బస్టాండ్ వెనుకభాగంలో వరద ప్రవాహంతో లోతట్టున ఉన్న ఇళ్లలోకి నీరు చేరుతుందనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమైంది. పట్టణంలో నాలుగు గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనం ఇబ్బంది పడ్డారు.

మాజీ సర్పంచుల అరెస్టు అప్రజాస్వామికం

జూలపల్లి: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలన్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంకణాల జ్యోతిబసు అన్నారు. ఎలిగేడు, జూలపల్లి మండలాల మాజీ సర్పంచులను మంగళవారం అరెస్టు చేసి ఠాణాలో ఉంచిన వారిని కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం జూలపల్లిలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో అబ్బాపూర్ సర్పంచ్ ఈర్ల మల్లేశం, బుర్హాన్‌మియాపేట సర్పంచ్ కొండయ్య, నారాయణపూర్(కట్టకింద పల్లె) సర్పంచ్ కొండాల్‌రెడ్డి ఉన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

ధర్మారం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా మంగళవారం ఉదయం ధర్మారం పోలీసులు మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఇందులో సాయికుమార్, అంజయ్య, శ్రీనివాస్, నారాయణ, కొండయ్యను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్టేషన్‌లో ఉంచి అనంతరం పంపించారు.

జీజీహెచ్‌లో సదరం శిబిరం



పరీక్షిస్తున్న డాక్టర్ రాజు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో మంగళవారం సదరం శిబిరం నిర్వహించారు. ముందుగానే స్లాట్ బుక్ చేసుకున్న తొమ్మిది మంది దివ్యాంగులు శిబిరానికి హాజరయ్యారు. వైకల్యం కలిగిన దివ్యాంగులను ఆర్థోసర్జన్, ఆర్‌ఎంఓ డాక్టర్ రాజు పరిశీలించి వైకల్యాన్ని పరిశీలించారు. దివ్యాంగుల వైకల్యాన్ని ఆన్‌లైన్‌లో డీఆర్‌డీఏ డాటా ఎంట్రీ ఆపరేటర్ సంపత్ నమోదు చేశారు. మీసేవా కేంద్రాల్లో ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులకు మాత్రమే ప్రతీ మంగళ, శుక్రవారాల్లో సందరం శిబిరంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

గోదావరిఖని: స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్జీ–1 యాజమాన్యం ఆధ్వర్యంలో 25రోజుల పాటు నిర్వహించిన ఉచిత క్రీడా శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, సీనియర్ పీవో హనుమంతరాజు, రమేశ్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడిలో హుండీ చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితంలోని ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదు, అమ్మవారి పుస్తెమట్టెలు, ముక్కుపుడక అపహరించారని గౌడసంఘం నాయకులు సుద్దాల సతీశ్ తెలిపారు. హుండీ డబ్బాను సమీపంలోని కాలువలో పడేశారని, బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఉపాధిహామీ సోషల్ ఆడిట్ గ్రామసభలు

రామగిరి: మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శైలజారాణి తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 29న లద్నాపూర్, 30న ముస్త్యాల, సుందిళ్ల, జల్లారం, 31న కల్వచర్ల, రత్నాపూర్, ఆదివారంపేట, పెద్దంపేట, బుధవారంపేట, జూన్ 2న చందానాపూర్, నవాబ్‌పేట, వెంకట్రావ్‌పల్లి, పన్నూర్, 3న బేగంపేట, రాజాపూర్, లొంకకేసారం, నాగేపల్లిలో గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు.

• దొంగతనం కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల శ్రీరామభద్ర ఆలయంలో చోరీకి పాల్పడిన బొబ్బిలి సదానందం, పొన్నాల శివశంకర్‌కు 10నెలల జైలుశిక్షతో పాటు రూ.200 జరిమానా విధిస్తూ సుల్తానాబాద్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ గణేశ్ మంగళవారం తీర్పు ఇచ్చారు. పొత్కపల్లి ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం గుంపుల మానేరు సమీపంలోని శ్రీరామభద్ర ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు 2024లో హుండీ దొంగతనం జరిగిందని ఆలయ చైర్మన్ వేల్పుల రమేశ్ ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జి.అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులకు శిక్షపడేలా కృషిచేసిన ప్రస్తుత ఎస్సై రమేశ్‌ను రామగుండం సీపీ అంబర్‌కిషోర్ ఝా, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి అభినందించారు.

• జూన్ 6న సర్వీసింగ్ సెంటర్ నిర్వహణకు వేలం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోని సర్వీసింగ్ సెంటర్ నిర్వహణకు జూన్ 6న వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అద్దె ప్రాతిపదికన కేటాయించే ఈ కేంద్రాన్ని పొందేందుకు ఆసక్తి గల వారు ఈనెల 28 నుంచి జూన్ 4 దాకా ప్రభుత్వ ఐటీఐ నుంచి దరఖాస్తు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుతో రూ.15వేల ధరావత్ చెల్లించి జూన్ 4లోగా అందించాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 97031 13881, 99896 16132 నంబర్లను సంప్రదించాలన్నారు.

• గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కమాన్‌పూర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. మండలంలోని రొంపికుంటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా, బడిబాటలో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్లు శారత, లక్ష్మి, రబియా ఉన్నారు.

• సులభ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి: సింగరేణిలో పనిచేస్తున్న సులభ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనంకు మంగళవారం సులభ్ కాంట్రాక్టు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. జూన్ 5న కొత్తగూడెంలో తలపెట్టిన ధర్నాను సులభ్ కాంట్రాక్టు కార్మికులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పుష్ప, రాధ, విజయ, సారయ్య ఉన్నారు.

• రమాబాయి భీంరావ్ అంబేద్కర్ వర్ధంతి

ధర్మారం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి భీంరావ్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాయలంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మార్కెట్ డైరెక్టర్‌లు కాంపెల్లి రాజేశం, మాజీ సర్పంచు గందం మల్లయ్య, నాయకులు ఓరం చిరంజీవి, గుమ్మడి శివకృష్ణ, సంతోష్, వంశీ, కృష్ణ, దేవి అనుదీప్, పవన్ పాల్గొన్నారు.

• ఓవర్‌మెన్ ఉద్యోగులను ఇబ్బంది పెట్టొద్దు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ప్రాజెక్టులో ఓవర్‌మెన్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారిని సూపర్‌వైజర్ల పేరుతో ఇబ్బందికి గురిచేయడాన్ని ఖండిస్తున్నామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహారావు మంగళవారం పేర్కొన్నారు. అధికారులే ఓవర్‌మెన్ కార్మికుల పనులు చేస్తూ 2017 కోల్‌మైన్స్ రెగ్యులేషన్‌ను కించపరుస్తున్నారన్నారు. అధికారులు వారికి కేటాయించిన జ్యూడీషియల్ పరిధిలో ఓవర్‌మెన్‌ల ప్రమేయం లేకుండా కార్మికులను కేటాయించి మిషనరీలు నడిపిస్తుండడం సరికాదన్నారు.

గోవధ చట్టం కఠినంగా అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: గోసంరక్షణ కోసం అమల్లో ఉన్న గోవధ చట్టాలను కఠినంగా అమలు చేయాలని, అక్రమంగా గోవులు తరలించకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని గోసంరక్షణ సమితి నాయకులు కోరారు. మంగళవారం వారు ఆర్డీవో గంగయ్యను కలిసి వినతిపత్రం అందించారు. గోసంతతి పోషణ కోసం ప్రభుత్వమే గోశాలలు ఏర్పాటు చేయాలని, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని విన్నవించారు. నాయకులు బత్తుల విజయ్, మురళీమోహన్, బొమ్మకంటి రవి, ఆంజనేయులు, సదానందం తదితరులు ఉన్నారు.

సింగరేణి వార్తలు

పర్యావరణ పరిరక్షణలో సింగరేణి తీరు భేష్



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న అధికారులు

గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణలో సింగరేణి తీరు అభినందనీయమని మినిస్ట్రీస్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ క్లైమేట్ చేంజ్ డైరెక్టర్ తరుణ్ కత్తుల కొనియాడారు. ఆర్జీ–1, 2, 3 ఏరియాల్లో పర్యావరణ తీరును మంగళవారం ఆయన పరిశీలించారు. సాయంత్రం రీజియన్‌లోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ సైదులు, జీఎంలు లలిత్‌కుమార్, బండి వెంకటయ్య, ఏజెంట్ రమేశ్, ఎన్విరాన్‌మెంట్ అధికారులు రవికిరణ్, శ్రీనివాసు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విజిలెన్స్ కేసులు వెంటనే పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి డిపెండెంట్ల విజిలెన్స్ కేసులు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్యకు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా విజిలెన్స్ వద్ద పెండింగ్‌లో ఉన్న మారుపేర్లు, ఇతర కారణాలతో పెండింగ్‌లో ఉండటంతో అనేక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. సింగరేణి యాజమాన్యం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద డిపెండెంట్ల కేసులన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక సంఘాలు వారికి అండగా నిలుస్తాయన్నారు. నాయకులు సతీశ్, రాజశేఖర్, శ్రావణ్, సుధాకర్, వెంకన్న ఉన్నారు.

ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జీఎం నాగేశ్వరరావు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్ 2న అన్ని గనులు, విభాగాల్లో ఉదయం జాతీయ పతాకం ఎగురవేయాలని సూచించారు. అనంతరం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం ఎదుట గల అమరవీరుల స్థూపానికి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే క్రీడా ప్రాంగణంలో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం బి.వి.సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ అధికారి ఎం.రామ్మోహన్, ప్రాజెక్టు అధికారి ప్రవీణ్ వి.ఫాంగింగ్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, మేనేజర్ కె.వి.రామరావు, సీహెచ్‌పీ డీజీఎం కాశీవిశ్వేశ్వరరావు, ఏరియా సర్వే అధికారి పి.జనార్దన్‌రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, అధికారులు గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్, రాజేశం, మురళి, రవిచంద్ర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

30న గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో గైర్హాజరు ఉద్యోగులకు ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జీఎం కొలిపాక నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ కార్యాలయం ఆదేశాల మేరకు ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లోని వివిధ గనులు, విభాగాల్లో పనిచేస్తూ నిర్దేశించిన మస్టర్ల కంటే తక్కువగా.. అనగా 2024లో 100 మస్టర్లు, 2025 ఏప్రిల్ వరకు 50 మస్టర్ల కంటే తక్కువ హాజరు నమోదు చేసిన ఉద్యోగులకు సెంటినరికాలనీలోని సీఎస్‌సీవోఏ క్లబ్‌లో ఉదయం 9గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదరు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో ఈ కౌన్సెలింగ్‌కు తప్పకుండా హాజరుకావాలని కోరారు. సంబంధిత గనుల సంక్షేమాధికారులు గైర్హాజరు ఉద్యోగులకు తెలియజేసి వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యేలా చూడాలన్నారు.

అమెరికా వెళ్లిన బీఆర్‌ఎస్ నేతలు



ఎయిర్‌పోర్టులో బీఆర్‌ఎస్ నాయకులు

గోదావరిఖని: అమెరికాలోని డల్లాస్ నగరంలో జూన్ 1న జరగనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు, బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబరాలకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పోలీస్‌హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ వెళ్లారు.